మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# మంచి ఫలితాలు సాధించాలి

**-జిల్లా విద్యాదికారి రాధాకిషన్**




మాట్లాడుతున్న జిల్లా విద్యాదికారి రాధాకిషన్

**చిన్నశంకరంపేట,మార్చి 13,ప్రభాతవార్త:**
పదవ తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. బుధవారం నాడు మండల పరిధిలోని సూరారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన విడ్కోలు సమావేశంలో వారు మాట్లాడుతూ పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పదిలో ఎలా పరీక్షలు వ్రాయాలో విద్యార్థులకు మెళకువలు నేర్పారు. జిల్లా వ్యాప్తంగా జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత,నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపధ్యాయులు సాయిరెడ్డి మాట్లాడుతూ ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిదుల సహాకారంతో పాఠశాలను అభివృద్ధి చేశామని, పాఠశాలలో తరగతి గదుల కొరత ఉన్నప్పటికీ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలకు లోనుకాకుండా పదవతరగతి విద్యార్థులకు ప్రత్యేక దృష్టి సారించి తరగతులను తిసుకుంటున్నామన్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, వచ్చే విద్యా సంవత్సరంలోపు భవనం నిర్మించేలా చర్యలను తీసుకోవాలని డీఈవో దృష్టికి తిసుకెళ్లారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా విద్యార్థులకు డీఈవో బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్, మాజీ సర్పంచి నీరజ, తూఫ్రాన్, మండల నోడల్ అధికారి సత్యనారాయణ, జిల్లా క్రీడా సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్, వివిధ పాఠశాలల ప్రధానోపధ్యాయులు శివప్రసాద్, వినోద్, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు వెంకయ్య, రమేష్, మనీష్‌రెడ్డి, జయశ్రీ, ఆసిఫ్, విద్యాసాగర్, రూపేందర్‌లు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన సీపీ అనురాధ



ఇంటర్ పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకుంటున్న సీపీ డా॥అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
జిల్లా కేంద్రంలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను సీపీ డా॥అనురాధ బుధవారం సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి మానిటర్ చేయాలని అమె సూచించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పరీక్ష కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు 5గురు కంటే ఎక్కువ గుమి కూడి ఉండొద్దన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు.

# ఆరు గ్యారెంటీల పథకాల అమలులో ముందుగా ఎస్సీ, ఎస్టీ ఉప కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

**-టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సుల్తానాగారి కృష్ణ మాదిగ**

**కొల్చారం, మార్చి13 ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం అములు చేస్తున్న ఆరు గ్యారెంటీల పథకాల అమలులో ముందుగా ఎస్సీ, ఎస్టీ ఉప కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సుల్తానాగారి కృష్ణ మాదిగ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి లాంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ పథకాల అమలులో అగ్రవర్ణాలకు కాకుండా ఎస్సీ, ఎస్టీ ఉప కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# అనుమతులు తక్కువ..అంతస్తులు ఎక్కువ

**-స్టీల్ట్ పేరిట అనుమతులు..నిబంధనలకు విరుద్దంగా సెల్లార్లు**
**-అనుమతులు ఇంటి నిర్మాణానికి..నిర్మించేది వ్యాపార సముదాయాలు**
**-అక్రమ నిర్మాణాలపై కౌన్సిల్‌లో సభ్యులు ప్రశ్నించిన ఫలితం శూన్యం**
**-పట్టింపు లేని టౌన్‌ప్లానింగ్ అధికారులు**



నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం..

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మున్సిపాల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు చూస్తుంటే నవ్వితే నవ్విపోదురుగా నా కేంటి సిగ్గు అన్నట్లు ఉందని చెప్పక తప్పదు. సిద్దిపేట మున్సిపాలిటీలో బంగ్లాలాలు నిర్మించుకునే యజమానులు తక్కువ అనుమతులు తీసుకొని ఎక్కువ అంతస్తులు నిర్మిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం పట్టించుకున్న పాపానపోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అనుమతులు మాత్రం బంగ్లాలాలు(ఇంటి) నిర్మాణాల పేరిట తీసుకొని వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్న పట్టించుకోవడం లేదు. మెదక్ రోడ్డులో ఓ వ్యక్తి బంగ్లా (ఇంటి) నిర్మాణం పేరిట అనుమతులు తీసుకొని పెద్ద యెత్తున వ్యాపార సముదాయాలు నిర్మించి సొమ్ము చేసుకుంటున్నాడని కౌన్సిల్ సమావేశంలో పలు మార్లు సభ్యులు మున్సిపల్, టౌన్‌ప్లానింగ్ అధికారులను నిలదీసిన ఫలితం మాత్రం శూన్యమని సభ్యులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణం పేరిట అనుమతులు తీసుకొని వ్యాపార సముదాయాలు ఏలా నిర్మిస్తారని సభ్యులు ప్రశ్నిస్తున్న ఇక్కడ పట్టించుకునే నాథుడు లేదని చెప్పక తప్పదు .పేద వాడు నిబంధనలకు విరుద్ధంగా పోరపాటున ఇళ్లు నిర్మిస్తే టౌన్‌ప్లానింగ్ అధికారులు అఘామేఘాల మీద వెళ్లి కూల్చి వేస్తారు కానీ ధనవంతులు, బడాబాబులు నిబంధనలకు విరుద్ధంగా అంతస్తుల మీద అంతస్తులు నిర్మిస్తున్న పట్టించుకున్న దాఖాలలు లేవని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతాలతో పాటు బఫర్ జోన్లలో బంగ్లాల నిర్మాణాలు జరుగుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు అందినక కాడికి దండుకొని చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారని ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. అలాగే అనుమతులు లేకుండా సెల్లార్లు నిర్మిస్తున్న అధికారులు అటు వైపు కన్నెతి కూడా చూడడం లేదంటే అసలు మతులబు ఏమిటన్నది అర్థమైతుంది. టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో కింద స్థాయి నుంచి పై స్థాయి అధికారి వరకు మామూళ్లు అందుతుండడంతో చడిచప్పుడు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే స్టీల్ట్ ఏరియా పేరిట అనుమతులు తీసుకొని సెల్లార్లు నిర్మిస్తున్న పట్టించుకోవడం లేదు.

**ఓ దళారితో కుమ్మక్కై వసూళ్లకు పాల ్పడుతున్న వైనం**

సిద్దిపేట మున్సిపాలిటీలోని సంబంధిత విభాగం అధికారి ఓ దళారితో కుమ్మక్కై అందినకాడికి దండుకుంటున్నట్లు అరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పట్టణంలో ఓ దళారి బంగ్లాలు నిర్మించే వారి వద్దకు వెళ్లి అనుమతులు లేకుండా అంతస్తులు నిర్మిస్తున్నారని అధికారి చెవిలో వేస్తారని తెలుస్తుంది. చెవిలో వేసిందే తడువుగా వెంటనే అంతస్తులు నిర్మించుకునే యజమానికి ఫోన్ చేసి పనులు నిలిపివేయాలని అదేశిస్తారని సమాచారం. దళారి ఎంతో కొంత తీసుకవచ్చి అధికారికి అప్పగించడంతో గుట్టుచప్పుడు కాకుండా పనులు నడుస్తాయని అరోపణలు వినబడుతున్నాయి. ఇటీవల పట్టణంలో ఓ వార్డులో ఇంటి నిర్మాణం కోసం అన్ని అనుమతులు తీసుకొని ఇంటి నిర్మాణం చేపడుదామనే సమయంలో దళారితో పాటు అ వార్డు కౌన్సిలర్ జలగల పీడించడంతో ఇంటి నిర్మాణం నిలిపి వేసినట్లు సమాచారం. కాగా ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణిని వివరణ కోరగా అక్రమ నిర్మాణాలు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనుమతులు లేకుండా అంతస్తులు, సెల్లార్లు నిర్మించొద్దన్నారు. మున్సిపాలిటీలో ఎవరూ కూడా మామూళ్లకు పాల్పడం లేదన్నారు.

# ప్రొటోకాల్ పాటించడంలేదని అధికారులపై ఆగ్రహం

**-వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి**
**-సర్వసభ్య సమావేశంలో ఎంపిపి పాండుగౌడ్**




సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పాండుగౌడ్

**మర్కుక్, మార్చి 13 (ప్రభాతవార్త):**
తమకు సమాచారం లేకుండానే అభివృద్ధి నిర్మాణ పనులను గ్రామాల్లో చేపట్టడం ఏమిటని, ప్రొటోకాల్ పాటించరా అంటూ అధికారులపై ఎంపిపి పాండు గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలకేంద్రం మర్కుక్ ఎస్సీ ఫంక్షన్‌హాల్‌లో ఎంపిపి పాండుగౌడ్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వివిధ శాఖల అధికారులు వారి నివేదికలను సభలో చదివి వినిపించారు. అనంతరం ఎంపిపి పాండుగౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం అయినందున తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టినా ఎంపిటిసిలకు సమాచారం తప్పనిసరి ఇవ్వాలని తెలిపారు. సమస్యలు లేని మండలంగా అభివృద్ధి పథంలో కలిసికట్టుగా మండలాన్ని ముందుకు తీసుకెళ్లామని గుర్తుచేశారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని పేర్కొన్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టు నుండి పక్క జిల్లాలకు సాగునీరు వెళ్తున్నా పక్కనే ఉన్న ఇప్పలగూడ గ్రామ చెరువులోకి నీరు రాకపోవడం పట్ల వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి అసహనం వ్యక్తం చేస్తూ ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రాజెక్టు నుండి చుట్టుపక్కల చెరువుల్లో నీరు నింపాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి, ఎంపిడిఓ అఫ్జలొద్దీన్, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యరేఖ, ఎంపిటిసి ధనలక్ష్మి, ఎంపిఓ రాజలింగం, మిషన్ భగీరథ ఏఈ తిరుమల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డిఆర్‌డిఓ ఎపిడి వి రోజా



ఉపాధి హామి పనులపై సామాజిక తనిఖీ ప్రజా దర్బార్‌లో పాల్గొన్న అధికారులు

**పాపన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త:**
ఉపాధి హామి పనుల నిర్వాహనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిఆర్‌డిఓ జిల్లా అదనపు పిడి వి రోజా హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా దర్బార్ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 2022-2023 సంవత్సరంలో నిర్వహించిన పనుల తీరుపై పరిశీలించారు. 3.31 కోట్ల రూపాయల పనుల్లో కూలీలకు 3.10 కోట్లు, వస్తు సామాగ్రికి 21.60 లక్షలు వెచ్చించినట్లు అధికారులు ధృవీకరించారు. ఆయా పనుల్లో దుర్వినియోగం అయిన 64వేల 352 రూపాయలను రికవరీ చేయడంతో పాటు 27వేల రూపాయలను జరిమాన విధించినట్లు ఎపిడి రోజా ప్రకటించారు. ఈ సందర్భంగా ఎపిడి రోజా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవినీతికి ఆస్కాం లేకుండా చేసేందుకు సామాజిక తనిఖీలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్ల విజిలెన్స్ అధికారి శ్రీహరి, క్యాసి రమాకాంత్, అంబుడ్స్‌మెన్ అధికారి ప్రభాకర్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి సంపత్, ఎంపిఓ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏపిఓ సంతోష్ కుమార్, ఆయా గ్రామాల ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# చి'వరి'కి నీటి గండం

**-చేతికొచ్చే దశలో ఎండుతున్న పంట**
**-ట్యాంకర్ల ద్వారా పొలాలకు నీటి పారకం**
**-పంటను దక్కించుకునేందుకు అన్నదాతల పాట్లు**




చిన్నశంకరంపేటలో వరి పంటకు ట్యాంకర్ల ద్వారా నీటిని పడుతున్న రైతు

**చిన్నశంకరంపేట,మార్చి 13,ప్రభాతవార్త:**
మండలంలో పలు చోట్ల వరి పొలాలు వాడిపోతున్నాయి. వ్యవసాయ బావులు ఎండిపోయి, బోరు బావులు పనిచేయక అన్నధాతలు దిక్కుతోచని పరిస్థితుల్లో ఆందోళన చెందుతున్నారు. మరి కొన్ని రోజుల్లో పంటలు చేతికందనుండగా చివరి తడులు పారించేందుకు కూడ నానా తంటాలు పడు తున్నారు. కొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. చిన్నశంకరంపేట పట్టణానికి చెందిన రైతు నవీన్ రెండు ఎకరాలలో వరి పంటను సాగు చేస్తున్నాడు. గత వారం రోజులుగా బోరులో నీరు రాకపోవడంతో వరి పంట చివరి దశలో ఉండటంతో వరి పంట చేతికందే సమయంలో ఇలా జరగడంతో తీవ్ర ఆందోళన చెందాడు. పంట ఎండిపోతుంటే చూడలేక ట్యాంకర్ల ద్వారా తన వరి పొలానికి నీటిని పడుతున్నారు. రోజుకు 8 వాటర్ ట్యాంకర్‌ల నీరు పడుతుందని, ఒక్కో ట్యాంకర్ రూ.600రుపాయలు అవుతుందని రైతు నవీన్ ఆవేదన వ్యక్తం చేశాడు.

# గజ్వేల్ తహసీల్దార్ సస్పెన్షన్

**గజ్వేల్, మార్చి 13 (ప్రభాతవార్త):**
కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండల తహసీల్దార్‌గా పనిచేసిన చిల్ల శ్రీనివాస్ కొత్తపల్లిలో 15 గుంటల స్థలానికి నకిలీ ధృవపత్రాలను సృష్టించి భూ ఆక్రమణకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ విషయంలో చిల్ల శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం గజ్వేల్ నూతన తహసీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టగా అతన్ని రిమాండ్ చేయడంతో సస్పెండ్ చేసినట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు.శ్రీనివాస్ స్థానంలో నూతన తహసీల్దార్‌గా జగదేవ్‌పూర్ నుండి శ్రావణ్ కుమార్‌ను నియమిస్తున్నట్లు ఆదేశాలు జారీచేశారు.

## చిరుధాన్యాలలో పోషక విలువలు ఎక్కువ



అలిరాజపేటలో సజ్జ పంటను పరిశీలిస్తున్న ఏఓ వసంతరావు

**జగదేవ్‌పూర్, మార్చి 13 (ప్రభాతవార్త):**
చిరుధాన్యాల పంటలలో పోషక విలువలు ఎక్కువగా ఉండి ఆరోగ్యానికి దోహదపడతాయని మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు అన్నారు. జగదేవ్‌పూర్ మండల పరిధిలోని అలిరాజపేట గ్రామంలో కారిటాస్ ఇండియా వారి ఉజ్వల-3 సౌజన్యంతో సాగుచేస్తున్న రైతుల చిరుధాన్యాల పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాలు అయిన సజ్జ, జొన్న, కొర్రలు వంటి పంటలలో పోషక విలువలు సమృద్ధిగా లభిస్తాయని, ఎక్కువ పీచు పదార్థాలు కలిగి ఉంటాయని, ఈ చిరుధాన్యాలను తింటే మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యాన్ని ఇస్తాయని, పిల్లలకు, వృద్ధులకు కావాల్సిన పోషకాలు ఎక్కువగా లభిస్తాయని అన్నారు. అదేవిధంగా ఈ పంటలకు తక్కువ నీరు సరిపోతుందని, చీడ పీడలు కూడా తక్కువగా ఉంటాయి కాబట్టి రైతులందరూ తమ ఇంటి అవసరాలకోసమైనా చిరుధాన్య పంటలు పండించుకొని మెరుగైన ఆరోగ్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారిణి శరణ్య, రైతులు రాగుల కిష్టయ్య, కరుణాకర్, శ్రీహరి, కరుణాకర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

## ప్రేమించిన యువకుడు మోసం చేయడంతో యువతి ఆత్మహత్య

**వర్గల్, మార్చి 13 (ప్రభాతవార్త):**
ప్రేమించిన యువకుడు మోసం చేయడంతో ఓ యువతి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వర్గల్ మండలం తునికిఖాల్సా గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గౌరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తునికిఖాల్సా గ్రామానికి చెందిన అల్లాపురం బాలమణి కూతురు అల్లాపురం అనిత(21) గత రెండు సంవత్సరాలుగా తుర్కపల్లిలోని ఓ కంపెనీలో పనిచేస్తుంది. ఈ క్రమంలో ములుగు మండలం శిలసాగర్ గ్రామానికి చెందిన నారగళ్ల అభిషేక్, అనితలు గత రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. అనిత తనను పెళ్ళి చేసుకోమని అభిషేక్‌ను అడుగగా అనితను పెళ్లిచేసుకోను అని చెప్పడంతో 45 రోజుల క్రితం అనిత ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చి విషయం తల్లికి తెలిపింది. దీంతో అనిత తల్లి బాలమణి తన అల్లుళ్ళు, కూతురుతో కలిసి అభిషేక్ కుటుంబసభ్యులతో వివాహం గురించి మాట్లాడడానికి వంటిమామిడికి వెళ్ళగా అక్కడికి అభిషేక్, అతని కుటుంబ సభ్యులు వచ్చి అనితను దూషించడంతో పాటు తాము పెళ్ళికి ఒప్పుకోమని చెప్పారు. దీంతో మనస్థాపానికి గురైన అనిత ఈనెల 12వ తేదీ మంగళవారం తల్లి బాలమణి గ్రామంలో మల్లన్న జాతరకు వెళ్ళగా ఇంట్లో ఎవరూ లేనిది చూసి వంట గదిలో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నేటి రైస్‌మిల్లు వేలం వాయిదా

**-ముందుకు రాని వ్యాపారులు**

**కొల్చారం, మార్చి13 ప్రభాతవార్త:**
నేడు గురువారం కొల్చారంలోని రైతు వేదికలో నిర్వహించాల్సిన రైస్‌మిల్లు వేలం పాట వాయిదా పడింది. మండలంలోని వరిగుంతం గ్రామంలో పైడి శ్రీధర్‌గుప్త నుండి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సీతా రామాంజనేయ రైస్‌మిల్లు వేలం పాట నేడు నిర్వహించవలసి ఉంది. అయితే బుధవారం సాయంత్రం 5 గంటల వరకు వేలం పాటలో పాల్గొనే వ్యాపారులు 20 లక్షల రూపాయల డీడీలు చెల్లించాలి. కానీ సాయంత్రం వరకు ఏ ఒక్క వ్యాపారి కూడా వేలం పాటలో పాల్గొనడానికి డీడీలు కట్టలేదు. ఈ విషయం తహశీల్దార్ గఫార్ మియాను వాకబు చేయగా ఇప్పటి వరకు ఎవరు కూడా వ్యాపారులు ముందుకు రాలేదని బుధవారం తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

## సెంట్రల్ లైటింగ్ మరింత దూరం పెంచండి

**-మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్,హైవేస్ వారికి ఎంపి బండి సంజయ్ లేఖ**

**హుస్నాబాద్,మార్చి13,ప్రభాతవార్త**
ఎల్కతుర్తి నుండి హుస్నాబాద్ మీదుగా రామాయంపేట వరకు జరుగుతున్న జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డు మధ్యలో వేస్తున్న సెంట్రల్ లైటింగ్ హుస్నాబాద్ శ్రీచైతన్య పాఠశాల వరకే వేస్తుండడంతో పట్టణ అభివృద్ధి కోసం లైటింగ్ సిష్టంను మరో కిలో మీటర్నర వరకు పెంచాలని కోరుతూ ఎంపి బండి సంజయ్‌కి ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న,కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్,కోమటి స్వర్ణలతలు వినతి పత్రం అందించిగా స్పందించిన ఆయన బుధవారం రోజున మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్,మైవేస్ వారికి లేఖ రాసారు.ఈ సందర్భంగా లేఖ రాసిన పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్,కౌన్సిలర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కొండపోచమ్మ నూతన పాలకమండలికి దరఖాస్తు చేసుకోవాలి

**జగదేవ్‌పూర్, మార్చి 13 (ప్రభాతవార్త):**
జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్‌నర్సాపూర్‌లో వెలసిన శ్రీ కొండ పోచమ్మ ఆలయ నూతన పాలకమండలికి ప్రభుత్వం దరఖాస్తులు కోరుతుందని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సాహవంతులైన వారు పాలకమండలి కమిటీలో అర్హత పొందేందుకు దరఖాస్తులను పది రోజులలోపు పెట్టుకోవాలని తెలిపారు.

## అక్రమ ఇసుక డంప్‌లపై టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసుల దాడి

**సిద్దిపేట రూరల్, మార్చి 13, ప్రభాతవార్త :**
జిల్లాలోని మద్దూరు పోలీసు స్టేషన్ పరిధిలోని వల్లంపట్ల గ్రామ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్సు, మద్దురు పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. అలాగే కుకునూర్‌పల్లి మండల పరిధిలోని వెలికట్టె గ్రామ శివారులో అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్ట పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.



అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

## కెపిఆర్ నగర్‌లో సిసి రోడ్లకు శంకుస్థాపన



సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

**చేర్యాల, మార్చి 13, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని జనగా మ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపా రు. బుధవారం పట్టణంలోని కెపిఆర్ నగర్‌లో రూ.1కోటి 60లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి కొమ్మూరి శంకుస్థాపన చేశారు. అనంత రం కొమ్మూరి మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని కులాల వారికి న్యాయం జరుగుతుందని అన్నారు.జనగామ నియోజవర్గానికి కావలసిన న్ని నిధులు తెచ్చుకుని అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్ర మంలో కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ అల్లం శ్రీనివాస్ ,కెపి ఆర్ వెల ఫ్ర్ అసోసియోషన్ అధ్యక్షులు వంగపల్లి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి ఆరెళ్ళ వీరమల్లయ్య, ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, గందే వేణుగోపాల్, కోశాధికారి శ్రీనివాస్, కాలని వాసులు బూరుగు సత్యనారాయణ, గౌరినా థ్, అల్లం రవి, రాకేష్, సంతోష్, మీసా వెంకటేష్, మంద శ్రీనివాస్, ఉప్పల నర్సింహులు, యాదగిరి, మహేందర్ పాల్గొని కొమ్మూరికి శాలు వాతో ఘనంగా సన్మానించారు.

## లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం పట్ల హర్షం




విలేకరులతో మాట్లాడుతున్న వీరశైవ లింగ బలిజ సమాజం, కాంగ్రెస్ నాయకులు

**సిద్దిపేట రూరల్, మార్చి 13, ప్రభాతవార్త:**

లింగాయత్ కార్పోరేషన్ ఏర్పాటుతో వీరశైవ లింగాయత్ బలిజ సమాజా నికి ఎంతో మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయ కులు నరకుల్ల శివప్ప అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో అయన మాట్లాడారు. ఎన్నో యేండ్లుగా లింగాయత్ కార్పోరేషన్ ఏర్పాటు డిమాండ్ ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వం కార్యరూపం దాల్చలేదన్నారు. తమ సమాజానికి చెందిన నాయకులు, మాజీ ఎంపి సురేష్ షెట్కర్ ప్రత్యేక చొరవ చూపడంతోనే కార్పోరేషన్ ఏర్పాటుకు మా ర్గం పడిందన్నారు. అర్థికంగా వెనుకబడి ఉన్న లింగాయత్ కుటుంబాలకు కార్పోరేషన్ ద్వారా లబ్ది జరుగుతుందన్నారు. కార్పోరేషన్ ఏర్పాటుకు సహకరించిన మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, దామోదర రాజ నర్సింహలకు కృతజ్ఞతలు తెలిపా రు. కామారెడ్డి జిల్లా గుడిమెట్ నుంచి కొలనుపాక వరకు జరిగే రేణుక చారి జయంతి పాదయాత్ర ఈనెల 19న సిద్దిపేటకు చేరుకుంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని కోటిలింగేశ్వర అల యంలో మహాస్వామి ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. వీరశైవ లింగాయత్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవం తం చేయా లన్నారు. సమావేశంలో లింగ బలిజ సమాజం నా యకులు శివకుమార్, యాదగిరి, రాజమౌళి, నాగరాజు, అరు ణ్, శ్రీనివాస్, అనిల్, రంజిత్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుతో పేద ఆర్యవైశ్యులకు మేలు

**-ఆర్యవైశ్య మహాసభ నాయకులు గంప శ్రీనివాస్, రత్నాకర్**



విలేకరులతో మాట్లాడుతున్న అర్యవైశ్య మహాసభ నాయకులు

**సిద్దిపేట రూరల్, మార్చి 13, ప్రభాతవార్త :**

రాష్ట్ర అర్యవైశ్య మహాసభ కోరిక మేరకు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో ప్రవేశపెట్టి అర్యవైశ్య కార్పోరే షన్ ఏర్పాటుకు అమోదించడం పట్ల రాష్ట్ర అర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, మహాసభ కార్యవర్గ సభ్యులు అయి త రత్నాకర్‌లు హర్షం వ్యక్తం చేశా రు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో అర్యవైశ్య కార్పోరే షన్ ఏర్పాటు చేస్తా మని హామీ ఇచ్చిన అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం అర్యవై శ్య కార్పోరేషన్ ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే కార్పోరేషన్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. రాష్ట్రంలోని నిరుపేద అర్యవైశ్యులకు కార్పోరేషన్ ఏర్పాటు ఎంతో మేలు చేస్తుందన్నారు. అర్యవైశ్యులకు న్యా యం చేసే వారికి తప్ప కుండా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అర్యవైశ్య కార్పోరేషన్ ఏర్పా టుకు నిర్ణయం తీసుకోవడం పట్ల సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అర్యవైశ్య, వాసవీ, వనిత క్లబ్ ప్రతినిధులు గుజ్జ చంద్రశేఖర్, చింతా రాజేంద్ర ప్రసాద్,గంప కృష్ణ మూర్తి, కటకం మోనయ్య, వీరేశం, కిషోర్‌కుమార్, వాణి, రవి, పుల్లూరు సుష్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మాక్‌పోలింగ్ నిర్వహించిన విద్యార్థులు

**నవాబుపేట, మార్చి 13, ప్రభాతవార్త** మండల కేంద్రంలోని ఉన్న పాఠశా లలో బుధవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. మొత్తం 136 మంది విద్యార్థులు ఓటర్ల జాబితా నమోదుచేసి ఉదయం 11 గంట లకు ఓటింగ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు మాక్ పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకుని ఓటు వేసే విధానంపై అవగాహన పొందారు. ఉపాధ్యాయుల సహకారంతో మాక్ పోలింగ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించి ఎన్నికల సరళిపై విద్యార్థులు అవగాహనకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**పరిగి, మార్చి 13, ప్రభాతవార్త** మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరివే సు కుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో సుల్తా న్పూర్ పాత బ్రిడ్జి దగ్గర జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. పరిగి పట్టణ కేంద్రా నికి చెందిన కురవ చిన్న నర్సింలు (50) గొంగళ్ల వ్యాపారం చేసుకుం టూ జీవనం సాగించేవాడు. తన వ్యాపారంలో న ష్టం జరగడం వల్ల మద్యానికి బానిస అయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు తాళ లేక మద్యం సేవించి మద్యం మత్తులో సుల్తాన్పూర్ పాత బ్రిడ్జికి ఉరి వే సుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య కురువ సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వీర్యం

- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖతార్
- తూతూ మంత్రంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వాహణ
- రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- క్షేత్రస్థాయిలో కనిపించని మున్సిపల్ కమిషనర్

**ఇబ్రహీంపట్నం, మార్చి 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇబ్రహీంపట్నం మున్సిపా లిటీ పేరు పెద్దది కాని క్షేత్ర స్థాయిలో చూస్తే రాష్ట్రంలో వరస్టు మున్సిపాలిటి అని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికి తోడు అధికారుల వైఫల్యం, నిర్లక్ష్యంతో మున్సిపాలిటీ మరింత వరస్టుగా తయ్యారవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై కొందరు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకేళ్తే ఆయన స్పంది ంచి మున్సిపల్ సమావేశంలో పాల్గొని అధికారులకు పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు మాత్రం ఏదో తూ తూ మంత్రంగా డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలు అధికారులకు ఏమి పట్టనట్లున్నాయని మున్సిపాలిటీ ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుధ్యంపై స్పెష ల్ డ్రైవ్‌లో బాగంగా ప్రతి రోజు ఒక వార్డులో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహి స్తున్నారు. మున్సిపాలిటీలో ఇప్పటి వరకు తొమ్మిది వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ పూర్తయ్యింది. కాగా ఆ వార్డుల్లో చూస్తే ఎక్కడ చూసిన మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ అంటే డ్రైన్లను క్లీన్ చేసి, ఫాగింగ్, బ్లీచింగ్, పిచ్చిమొక్కలను తోలగించాలి, బహిరంగంగా మురికి నీరు ప్రవహిం చకుండా చూడాలి కాని అధికారులకు అవేమి పట్టవు. దీనికి కమిషనర్ ప్రర్య వేక్షించి సిబ్బంది పారిశుధ్యం సరిగ్గా నిర్వహిస్తున్నారా లేదా అని చూడాలి కాని మున్సిపాలిటీ కమీషనర్‌కు అదేమి పట్టకుండ పారిశుధ్యం సరిగ్గ ఉన్నచోట వచ్చి ఫోటోలు దిగి ఎమ్మెల్యేకు పంపడమే ఆయన పని అన్నట్లుగా వ్యవహ



మూడు రోజులుగా రోడ్డుపైనే డ్రైన్ నుండి తీసిన వ్యర్థాలు



ఎనిమిదవ వార్డులో టిఆర్ఆర్ హైస్కూల్ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

రిస్తున్నారు. పారిశుధ్యం సరిగ్గ నిర్వహిస్తున్నామని ఫోటోలు దిగి ఎమ్మెల్యేకు పంపి ఆయన వద్ద మార్కులు కోట్టేయ్యాలనే తప్ప క్షేత్రస్థాయిలో పారిశుధ్యం ఏవిదంగా ఉంది అనేది కనిసం పట్టించుకోరనే విమర్శలు ఆయనపై లేకపోలేవు. మున్సిపాలిటీలో ఎనిమిది, తొమ్మిది వార్డులో పారిశుధ్యం సరిగ్గ నిర్వహించ లేదని మున్సిపాలిటీ కమీషనర్‌ను అడగ్గా ఆ వార్డులు చాలా పెద్దవని ఇంకా 16 వార్డులు పెండిగ్ ఉన్నాయని అవి పూర్వయ్యేవరకు ఇంకా 16రోజుల సమ యం పడుతుందని వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ పూర్తయ్యాక ఎనిమిది, తొమ్మిది వార్డుల్లో మరోసారి నిర్వహిస్తామని సమాదానం ఇచ్చారు.కాగా దీనిపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించాలని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.



మంచాల్ రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

## క్యాబినెట్ నిర్ణయాలపై హర్షం

**టిపిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్**

**కడ్తాల్,మార్చి 13 ప్రభాతవార్త :** ఎన్నో ఏళ్ళుగా కార్పోరేషన్‌లు లేని సామాజిక వర్గాల ప్రజల కోరిక మేరకు కొత్తగా 16 కార్పోరేషన్‌లను ఏర్పాటుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం కులవృత్తుల వారికి సామాజికంగా వెనకబడిన వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్ని ఉద్యమాలు చేసిన కొత్త కార్పోరేషన్‌ల విషయం పెడచెవిన పెట్టిందన్నారు. కార్పోరేషన్‌ల ద్వారా ఆయా వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ళు 4.5 లక్షల ఇళ్ళు నియోజకవర్గంకు 3500 ఇస్తామని ఆమోదించడం ఇళ్ళులేని వారి కల నిజమయ్యే రోజు వచ్చిందన్నారు. మహిళా సాధికారతకై మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా ఓఆర్ఆర్ చుట్టూ వారికి జాగా కేటాయించి 15 అంశాలతో కూడిన మహిళా శక్తి పథకం ఏర్పాటు చేసి మహిళా సంఘాల తయారు చేసే ఉత్తత్తులు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేయడానికి ప్రభుత్వం తోడ్పాటు, గీత కార్మికుల సంరక్షణకు సురక్షిత మోకులు ఇచ్చి గీత కార్మికులకు వెన్నుదన్నుగా ఉంటామనడం సంతోషకమని అన్నారు. 2008 డీఎస్సీ అభ్యర్థుల భరోసా కల్పించడం ఇంకా చాలా నిర్ణయాలు మంత్రివర్గం తీసుకోవడం ప్రజలంతా హర్షిస్తున్నారని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

## యాచారంలో ఘనంగా మొల్ల జయంతి ఉత్సవాలు



మొల్ల మాంబ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

**యాచారం మార్చి13,ప్రభాతవార్త :** మొల్ల మాంబ జయంతి సందర్భంగా కుమ్మ ర సంఘం మండల అధ్యక్షుడు కొండాపురం శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో యా చారం మండలం ప్రాథమి ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న సాగర్ రహదారిపై గల మొల్ల మాంబ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా సంఘం నాయకులు మాట్లాడుతూ....కుమ్మరుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభు త్వం కృషి చేయాలని కోరారు. మండలాల వారిగా కుమ్మరుల భవనాల కోసం స్థ లం కేటాయించి భవనాలను నిర్మించాలని అన్నారు. కుమ్మర సంఘం అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేత

**యాచారం మార్చి13,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మన జై భీం ఎడ్యుకేటెడ్ యూత్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నందివనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తర గతి విద్యార్థులకు పరీక్షలకు కావాల్సిన సామాగ్రి ప్యాడ్,పెన్నులు, స్కేల్, పెన్సిల్‌లను అందజేశారు. ఈ సందర్భంగా యువజన సంఘం అధ్యక్షుడు భూపతి భరత్ మాట్లాడుతూ...విద్యార్థులకి బాగా చదవి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యుత్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేస్తున్న దృశ్యం



గోమాతకు సీమంతం చేస్తున్న మహిళలు

## ఘనంగా గోమాతకు సీమంతం

**షాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** షాబాద్ మండల పరిధిలోని సీతారాం పూర్ గ్రామంలో సీతారామ కుటీరంలో గోమాతకు జోషి గాయత్రి ఆధ్వర్యం లో బుధవారం ఘనంగా సీమంతం నిర్వహించారు. ఈసందర్భంగా జోషి గాయత్రి మాట్లాడుతూ.... ప్రకృతిలోని జీవులతో మనిషికి ఉన్న అనుబం ధాన్ని గుర్తుచేస్తూ భారతీయ సాంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. స్త్రీ మరో జీవికి ప్రాణం పోసే ముందు క్షేమాన్ని కాంక్షిస్తూ హిందూ సృ్కతిలో జరిపే ముఖ్య ఘట్టం శ్రీమంతం అని అన్నారు. తల్లి పుట్టబోయే శిశువు క్షేమాన్ని ధీర్ఘాయుష్షుని కోరుతూ జరిపించే సాంప్రదాయ వేడుక సర్వసాధార ణంగా గర్భవతికి 5వ నెలగాని, 9వ నెలలో గాని సీమంతం జరుపుకుం టారన్నారు. ఈనేపథ్యంలో గోమాతకు కూడా శ్రీమంతం జరుపుతున్నా మన్నారు. భారతీయ సాంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉన్న గోవుకు ఓ కు టుంబం అత్యంత ఘనంగా శ్రీమంతం నిర్వహించామన్నారు. ఈకార్యక్రమం లో జోషి మధుకర్, గాయత్రి, సాయిప్రజ్ఞా, విశాల్‌శర్మ, గ్రామస్థులు తదిత రులు ఉన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

**కొడంగల్,మార్చి 13ప్రభాతవార్త** కొడంగల్ ఆర్యవైశ్య సంఘం అద్వర్యంలో రాష్ట్రముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్ర మాన్ని నిర్వహించారు.ఆర్యవైశ్య ఫెడరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు మం గళవారం ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు,పీఏసీఎస్ అధ్యక్షులు కట్కం శివకుమార్ అద్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నందారం ప్రశాంత్,కొత్త ఎల్లయ్యగుప్త నందారం రత్నం,కట్కం గౌరీశంకర్,కొట్రికె లక్ష్మీనారా యణగుప్త,అన్నారం మురళీగుప్త తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు నందారం ప్రశాంత్ మాట్లాడుతు ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నదని,గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు.ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి హయంలో ఆర్యవైశ్య ఫెడరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు.అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్,మాజీ జడ్పీటీసీ ఏన్గు ల భాస్కర్,గోడల రాంరెడ్డి,చిట్లపల్లి మాజీసర్పంచ్ వెంకటరెడ్డిలతో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు చిద్రి వినోద్‌కుమార్,ఆకుల ప్రవీణ్, వెంకటేష్, కట్కం పవన్,కట్కం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్‌ది ప్రజాపాలన

**ఆమనగల్లు, మార్చి13, ప్రభాతవార్త:** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజ లకు ఇచ్చిన ప్రతిఒక్క హామీని నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి ప్రభు త్వం ప్రజావిశ్వాసం చూరగొట్టుందని కేఎస్ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్ అన్నారు. ఆరు గ్యారంటీ స్కీంల్లో 5 గ్యారంటీలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్న తీరును జీర్ణించుకోలేని విపక్షా లు ఉద్దేశపూర్వకంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై బురదజల్లె ప్రయత్నాలకు ఒడిగడుతున్నాయని ఆయన విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పెంపు, రూ. 500కే సిలిండర్, ఇందిరమ్మ ఇళ్ళు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలకు రేవంత్‌రెడ్డి సర్కారు శ్రీకారం చుట్టిందని ఆయన వివరించారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్.నారాయన్‌రెడ్డి

## దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

**సొసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి**

**పెద్దేముల్, మార్చి 13,ప్రభాతవార్త:** ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేం ద్రాలు ఎంతో దోహదం చేస్తాయని మండల కాంగ్రెస్‌పార్టీ మాజీ అధ్య క్షుడు, సొసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో గిడ్డ శ్రీనివాస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీసర్పంచ్ ఆర్.శ్రావన్, కాంగ్రెస్ గ్రామకమిటి అధ్యక్షుడు మైపూస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజసేవకుపాటుపడేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని అన్నారు. అందుకు గిడ్డ శ్రీనివాస్ ముందుకు వచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రతి వ్యక్తి తాను సంపాదించిన వాటిలో కొంతనైన సమాజసేవకు ఖర్చుపెడితే అందులో వచ్చే తృప్తి మరేం దులోలేదని అన్నారు. సమాజసేవే పరమావధిగా భావించి సమాజసేవకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంజీవ్, మాజీ సర్పంచ్ బోయిని నారాయణ, సీనియర్ నా యకులు ముజీబ్, పాండు, డాక్టర్ సురేష్, సుజ్ఞాని, యేసు, చెక్క భీములు, అనంతయ్య తదితరులుపాల్గొన్నారు.

## ఎన్‌టీపీసీ రోడ్డు అభివృద్ధికి రూ.30 లక్షల కేటాయింపు

**కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి**



నిధుల కేటాయింపు ఉత్తర్వుకాఫీని వజ్రేశ్ యాదవ్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డికి అందజేస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 13, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ అన్నో జిగూడ ఎన్‌టీపీసీ రోడ్డు అభివృద్ధికి గాను కాంగ్రెస్ ప్రభుత్వం 30 లక్షల రూపాయల నిధులు కేటాయించిందని కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నిధులు కేటాయించిన ఉత్తర్వు కాఫీని మేడ్చల్ నియోజకవర్గ ఇంఛార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్ తనకు అందజేసినట్లు తెలిపారు. అన్నోజిగూడ ఎన్‌టీపీసీ నుండి రాజీవ్ గృహ కల్ప వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు 30 లక్షల నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే నియోజకవర్గ పార్టీ ఇంఛార్జీ వజ్రేశ్ యాదవ్‌కు కృతజ్ఞలు తెలిపినట్లు పేర్కొన్నారు.

## పది పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలి

**ఏ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు**



విద్యార్థులకు ప్యాడ్, పెన్నులను అందజేస్తున్న లొంక నర్సిములు

**పెద్దేముల్, మార్చి 13, ప్రభాతవార్త:** విద్యార్థులు పదవ తరగతి పరిక్షలు ప్రశాంతంగా రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలని కాంగ్రెస్‌పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు, హన్మాపూర్ మాజీ సర్పంచ్ లొంక నర్సిములు ఆకాంక్షించారు. బుదవారం పెద్దేముల్ మండలం తట్టెపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థు లకుపరిక్షలు రాయడానికి ప్యాడ్‌లను, పెన్నులు, పెన్సిల్లను అంద జేశారు. పదవ తరగతి పరిక్షల ఫలితాలలో మండల టాపర్‌గా వచ్చిన విద్యార్థికి రూ. 25 వేలు, సెకండ్ టాపర్‌కు రూ. 11 వేలు బహుమతిగా ఇవ్వనున్న ట్లు చెప్పారు.మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కొండపురం గోపాల్, సొసై టి వైస్ చైర్మెన్ అంజయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదిత రులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి చేసింది ప్రధాని మోడీనే..

**చేవెళ్ల పార్లమెంటు బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి**



జెండాను ఆవిష్కరణ చేసిన దృశ్యం

**మొయినాబాద్, మార్చి 13 ప్రభాతవార్త:** గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్రంలోని మోడీ నాయకత్వంలో పని చేస్తున్న ప్రభుత్వమేనని, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని చేవెళ్ల పార్లమెంటు బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మొయినాబాద్ మండలం చాకలి గూడెం గ్రామంలో బుధవారం బిజెపి జెండా ఆవిష్కరణ చేసి జెండా పం దుగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ మరోసారి మనందరం కలిసి కమలం గుర్తుకు ఓటేసి ఎక్కువ ఎంపి సీట్లు సాధించి మోడికి బహుమతిగా ఇవ్వగలిగితే దేశంతో పాటు ప్రతి గ్రామం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు ప్రభా కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజమల్లేష్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి చంద్రశేఖర్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, వెంకటేష్ ము దిరాజ్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న జాతర మహోత్సవాలు.

**చేవెళ్ల, మార్చి 13 ప్రభాతవార్త :** మండలంలోని చేవెళ్లలో మహా శివరాత్రి జాతర ఉత్సవాల్లో భక్తులు రద్దీ కొనసాగుతుంది.స్వామి వారికి అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వా మిని భక్తులు దర్శించుకుని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరిస్తు న్నారు. వివిధ ప్రాంతాల నుంచి జాతరకు భక్తులు విచ్చేసి జాతరను తిలకిస్తు న్నారు. స్వామి వారి సన్నిధివద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుం డా ఎప్పిటికప్పుడు పోలీసులు, ఆలయ అర్చకులు చర్యలు చేపడు తున్నారు.

## మహిళ దినోత్సవం పురస్కరించుకొని వినూత్న కార్యక్రమాలు

శామిర్‌పేట మార్చి13,ప్రభాతవార్త : అంతర్జాతీయ మహిళ దినోత్స వాన్ని పురస్కరించుకొని రత్నదీప్‌లో వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. నగరం లోని రత్నదీప్ నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్న వారు మహి ళల ఆరోగ్య ఉత్పత్తులపై తమ ఆలోచనలను పంచుకున్నారు.తద్వారా బహిరంగ చర్చ,మహిళా సాధికారతకు ఒక సుకక్షితమైన వేదికను సృష్టిం చారు.రత్నదీప్‌లోని మొత్తం ఉద్యోగుల్లో 65శాతానికి పైగా మహిళలే ఉన్నారంటూ మహిళా సాధికారతకు తోడ్పడటంలో తమ అంకితభావాన్ని నొక్కి చెప్పారు.



విగ్రహ ప్రతిష్టాపనలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు

## విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న కాంగ్రెస్ నేత నీలం మధు

**అమీన్‌పూర్, మార్చి 13 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లి గ్రామంలో శ్రీ కోదండ సీతారామచంద్ర, ఆంజనేయల మహా విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధుముదిరాజ్ హాజరై మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరుకున్నట్లు చెప్పారు. ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరయడంతో మంచి జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చారు. ప్రజలకు ఉపయోగపడే వ్యక్తిగా ఎదగాలని దీవించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మన్నె పోచయ్య, శ్రీధర్‌గౌడ్, మల్లేష్, శ్రీకాంత్‌రెడ్డి, రవిగౌడ్, వడ్డె రమేష్, దుర్గారెడ్డి, నందయ్య, ప్రభాకర్, సుధాకర్, మధు, రవి, కుమార్, గ్రామ పెద్దలు, ప్రజలు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**వెల్దుర్తి, మార్చి 13 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలం నాగ్సాన్‌పల్లి యూపీఎస్ పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యా బోధన అందించారు. డీఈవో మహేష్, ప్రధానోపాధ్యాయురాలిగా నందిని, పీఈటీగా కార్తీక్, మనీష, హర్షిత్, ఉపాధ్యాయులుగా మానస, అశ్వంత్, ఉపేందర్, ప్రవిజ్ఞలు వ్యవహరించారు. తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నాగరాజు శర్మ, జ్యోతిలు పరిశీలించి వీరి ప్రతిభను గుర్తించి బహుమతులను ప్రధానం చేశారు.

## సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సిఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, మార్చి 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ప్రకటించిన సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాట్లు నిర్ణయం పట్ల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షులు, కొమురవెల్లి అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు, ఆర్యవైశ్య సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## నిరుపేద యువతికి పుస్తెలు, మెట్టెలు పంపిణీ

**గజ్వేల్, మార్చి 13 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సున్నం మంజుల, బిక్షపతిల కూతురు కీర్తన వివాహం సందర్భంగా హైద్రాబాద్ చెందిన నిమ్మల శంకర్ దాతృత్వ స్వభావంతో పుస్తెలు, మెట్టెలను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చందా నర్సింలు చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, కౌన్సిలర్ అల్వాల బాలేష్, కో-ఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, సంఘం ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, కోశాధికారి గంగిశెట్టి నర్సింలు, నాయిని ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేత

**వర్గల్, మార్చి 13 (ప్రభాతవార్త):** మండలంలోని తునికిఖాల్సా గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 33 మంది విద్యార్థులకు కాంగ్రెస్ నాయకుడు సల్మాన్‌హుస్సేన్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్స్, జామెంట్రీ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గరపడడంతో వారికి కావాల్సిన పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, జామెంట్రీ కిట్స్ అందజేసినట్లు తెలిపారు. 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తునికిఖాల్సా గ్రామ కార్యదర్శి ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు శ్యామ్, ఆంజనేయులు, సాయిగౌడ్, భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి బంగారు భవిష్యత్తుకు పునాది పదో తరగతి

**బెజ్జంకి, మార్చి 13, ప్రభాతవార్త :** ప్రతివిద్యార్థి బంగారు భవిష్యత్తును నిర్మించుకునేందుకు పదో తరగతి పునాది రాయిలాంటిదని బిఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దోళ్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుండారం, రేగులపల్లి గ్రామాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అయన పరీక్ష ప్యాడ్స్, పెన్నులను అందజేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థి పోటీ తత్వంతో చదవాలని పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. గుండారం ఎంపిటిసి ఎలుక లత మాట్లాడుతూ పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే రూ.2016 అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రామంచ రవిందర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, జనగామ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ వెలికట్ట గ్రామ కమిటీ ఎన్నిక

**కొండపాక, మార్చి 13, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగరావు అధ్వర్యంలో బుధవారం వెలకట్ట గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పెరుగు తిరుపతి, ఉపాధ్యక్షుడుగా అమ్ముల కిషన్, ప్రధానకార్య దర్శిగా దొమ్మాట మహేష్, సహయ కార్య దర్శిగా అరుట్ల బాబు, బిసి సెల్ అధ్యక్షుడుగా పెరుగు దర్మరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొమురవెల్లి శ్రీనివాస్, ఎస్సీ సెల్‌అధ్యక్షుడుగా దొమ్మాట ప్రేమ్ కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ముత్తని మధు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అమ్ముల నరేష్, జనరల్ సేక్రటరీగా అమ్ముల రజినీకాంత్, తదితరులను ఎన్నుకున్నట్లు లింగరావు తెలిపారు. కార్యక్రమంలో మేరుగు ప్రభాస్, ఎర్రబోయిన త్రినేష్, పెరుగు శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు

**సిద్ధిపేట రూరల్, మార్చి 13, ప్రభాతవార్త:** సిద్ధిపేట పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో బుధవారం ప్రముఖ రచయిత మొల్లమాంబ జయంతి వేడుకలను టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి మొల్ల చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దరిపల్లి చంద్రం మాట్లాడుతూ మొల్ల రామాయణం చాలా ప్రసిద్ధిగా ఒచిందని తెలిపారు. అష్ట దిగ్గజాలలో ప్రముఖుడైన తెనాలి రామకృష్ణ లాంటి ఉద్దండులను వాదనలో ఓడించిన చరిత్ర మొల్లదని గుర్తు చేశారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మొల్లమాంబ విగ్రహానానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

# గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్

**హుస్నాబాద్, మార్చి 13,ప్రభాతవార్త :** మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లిలో నిర్మిస్తున్న ప్రాజెక్టును బుదవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డీఈ ప్రశాంత్,కరుణశ్రీలకు ప్రాజెక్టు స్టేటస్‌తో పాటు అవసరమైన భూసేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రాజెక్టు నిర్మాణ పనులు దాదాపు పూర్తయిన సందర్భంగా డిస్టిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా భూసేకరణచేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

గౌరవెల్లి ప్రాజెక్టు మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్



## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**వర్గల్, మార్చి 13 (ప్రభాతవార్త):** రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం గౌరారం రాజీవ్‌రహదారిపై బుధవారం ఉదయం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సింగాయిపల్లి గ్రామానికి చెందిన నల్లా ఆండాలు(60) గౌరారంలోని గోదావరి రుచులు హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. రోజులాగే బుధవారం ఉదయం 6 గంటల సమయంలో రాజీవ్‌రహదారి మీదుగా నడుచుకుంటూ హోటల్‌కు బయల్దేరగా ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ సమీపంలోకి చేరుకోగానే సిద్దిపేట నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆండాలు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న గౌరారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి కూతురు రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ పేర్కొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీల దాడి



పేకాట ఆడుతూ పోలీసులకు పట్టిబడిన దృశ్యం

**కోహెడ, మార్చి 13, ప్రభాతవార్త :** మండలపరిధిలోని శనిగరం గ్రామంలో న్యూయార్క్ టైలర్ షాప్‌లో పేకాట అడుతున్నట్లు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కోహెడ పోలీసులు బుధవారం దాడి చేశారు. పేకాట అడుతున్న మొగుళ్లపాలేం కృష్ణంరాజు, బండారి శంకర్, బుడుగు రాజు, ఒర్రెల లక్ష్మణ్‌లను అదుపులోకి తీసుకొని రూ.6,300 నగదు, 3 సెల్‌ఫోన్లు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పేకాట అడివారిపై చట్టపరంగా చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఎక్కడైనా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే 8712667447 లేదా 8712667446 ఫోన్ చేయాలన్నారు.

## చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి సేవలో నవీన్‌మిట్టల్

**కీసర,మార్చి13,ప్రభాతవార్త:** మండలంలోని శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామిని తెలంగాణ రాష్ట్ర ల్యాండ్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ బుదవారం దర్శించు కున్నారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగ తం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం స్వామివారి శేష వస్త్రాలు తీర్ధ ప్రసాదాలు అందజేసి ఘనంగా ఆశీర్వచనం అందజేశారు.

# కిరోసిన్ పోసుకుని యువతి ఆత్మహత్య

-యువతి మరణం పట్ల మంత్రి ద్రిగ్భాంతి...



అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, మార్చి 13,ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వడ్డెపల్లి రమణ కూతురు శ్రీజ (20) బుదవారం రోజున ఇంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకోవడం హుస్నాబాద్‌లో కళకళం రేపింది. బిల్డింగ్‌పై నిప్పంటించుకున్న శ్రీజ మంటలు చెలరేగడంతో నొప్పిని భరించలేక అరుపులతో మెట్లపై నుండి క్రిందకు వస్తున్న క్రమంలో మెట్లపై నుండి కింద పడి తలకు తీవ్రమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలతో కొట్టుమిట్టాడతుండగా గమనించిన కుటుంబ సభ్యులు హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మరణించింది. ఈ సందర్భంలో హుస్నాబాద్‌లోనే ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని శ్రీజ తండ్రి రమణను ఓదార్చా రు. శ్రీజ అకాల మరణం పట్ల మంత్రి పొన్నం సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మరణంతో మంత్రి ద్రిగ్భాంతికి గురై బుదవారం జరిగే కార్యక్రమాలన్ని రద్దు చేసుకుని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. పోస్టు మార్టం అనంతరం నిర్వహించిన శ్రీజ అంత్యక్రియల్లో పాల్గొన్న ఆయన మరణించిన శ్రీజ పాడె మోసి అంత్యక్రియలు పూర్తయ్యేవరకు అక్కడే ఉన్నారు. ఇదిలా ఉండగా శ్రీజ ఆత్మహత్యకు గల కారణం తెలియాల్సి ఉంది.

## సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**పటాన్‌చెరు, మార్చి 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిన్నారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నారా బోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో మత్స్యశాఖ సభ్యులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ కులాలకు నూతన 16 కార్పొరేషన్లు రాష్ట్ర కెబినేట్ ఆమోదం తెలుపడం... ఇందులో ముదిరాజ్ కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రజలే గర్వించాల్సిన విషయమన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాలకు కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. అలాగే మెదక్ జిల్లా పార్లమెంట్ సీటును కాంగ్రెస్ నాయకులు నీలం మధు ముదిరాజ్‌కు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ నారబోయిన మహేష్, గ్రామ మత్స్యశాఖ అధ్యక్షుడు నరసింహా, మాజీ ఉప సర్పంచి శ్రీనివాస్, మత్స్యశాఖ చైర్మన్ గణేష్ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## నేటి సమావేశాన్ని విజయవంతం చేయండి

**చిన్నశంకరంపేట, మార్చి 13,ప్రభాతవార్త:** ఎమ్మార్పిఎస్, ఎంఎస్‌పీ అను బంధ సంఘాల పార్లమెంటరి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమార్పిఎస్ మండలాధ్యక్షుడు డప్పు స్వామి పిలుపునిచ్చారు. బుధవారం చిన్నశంకరంపేట లో వారు మాట్లాడుతూ ఈ పార్లమెంటరి సమావేశం నేడు మెదక్ జిల్లా కేంద్రంలోని ద్వారక గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు, సమావేశానికి ముఖ్య అతిధిగా మంద క్రిష్ణమాదిగ హజరవుతున్నారని, ఎమ్మార్పిఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హజరై విజయవంతం చేయాలన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు

**హుస్నాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** మండలంలోని మీర్జాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికో త్సవ వేడుకలను బుధవారం రోజున ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేఖా రాణికుమారస్వామిలు సొంత ఖర్చులతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఉపాధ్యాయులు ముజామిల్ షఫీ, సతీష్‌లు అధ్యక్షత వహించారు. వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు, కొరియోగ్రఫి, యాంకరింగ్, స్టేజ్ డెకరేషన్‌లాంటి కార్యక్రమాలు విద్యార్థుల తల్లితండ్రులను అలరించారు. కార్యక్రమంలో ఎంఈవో దేశిరెడ్డి, పూర్వ విద్యార్థి డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠవాల ప్రధానోపాధ్యాయులు వేణుకుమార్, అధ్యాపక బృధంతో పాటు తాజా మాజీ సర్పంచ్ తరాల లత మహేందర్, మాజీ ఎస్ఎంసి చైర్మెన్ పొన్నబోయిన శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మొల్లమాంబకు ఘన నివాళులు



మొల్లమాంబ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నేతలు

**గజ్వేల్, మార్చి 13 (ప్రభాతవార్త):** పట్టణంలో కవయిత్రి మొల్లమాంబ 584వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కుమ్మరి సంఘం గజ్వేల్ మండల అధ్యక్షుడు నాగపురి బాబు ఆధ్వర్యంలో బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఎదురుగా ఉన్న కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమె చేసిన సేవలు మరువలేనివని, ఆమె చూపిన బాటలో నడుస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగపురి రమేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొలిచెలిమె స్వామి, గజ్వేల్ మండల ఉపాధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి తొవ్వల యాదగిరి, కోశాధికారి మహేష్, మల్లేశం, పోచయ్య, మండల యూత్ అధ్యక్షుడు నాగపురి చందు, కుమ్మరి యాదగిరి, డాకూరి బాలచంద్రం, వడ్డేపల్లి యాదగిరి, కొండల్, నాంపల్లి కరుణాకర్, స్వామి, శ్రీను పాల్గొన్నారు.

## తునికి శ్రీనల్లపోచమ్మ ధర్మకర్తల మండలికి దరఖాస్తుల స్వీకరణ

**కౌడిపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:** మెదక్ జిల్లాలోనే రెండవ అతి పెద్ద జాతరగా పేరుగాంచిన తుని కి శ్రీ నల్ల పోచమ్మ ఆలయ ధర్మకర్తల మండలి ఎంపికకు అభ్య ర్థులను దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఈఓ మోహన్ రెడ్డి బుధ వారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా ధర్మదా య దేవదాయ శాఖ కమీషన్ అనిల్‌కుమార్ తునికి శ్రీ నల్ల పోచ మ్మ ఆలయ పాలక వర్గ సభ్యుల ఎంపిక కొరకు నోటిఫికే షన్‌ను ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ వ్యక్తిగత వివరాలతో కూడిన దంఖాస్తును నేటి నుండి 10 రోజులలోపు దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమీ షనర్ సంగారెడ్డి నందు చేసుకోవాలిని ఆయన తెలిపారు.



తునికి శ్రీ నల్ల పోచమ్మ తల్లి

## సమాజ హితమే లయన్స్ క్లబ్ లక్ష్యం

**సిద్దిపేట రూరల్, మార్చి 13, ప్రభాతవార్త :** అంతర్జాతీయ స్థాయిలో సమాజ హితమే పరమావధిగా స్థాయిలో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఏకైక సంస్థ లయన్స్‌క్లబ్ మాత్రమేనని లయన్స్ జిల్లా గవర్నర్ డా॥ లక్ష్మీ అన్నారు. మంగళవారం రాత్రి సిద్దిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం, 51వ చార్టర్ నైట్ కార్యక్రమం పురస్కరించుకొని పలు సేవ కార్యక్రమాలు చేపట్టి, వివిధశాఖలలో ఉత్తమ సేవలందిస్తున్న మహిళలను లయన్స్ భవన్ లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతో మంది పేదవారు ఉన్నారని వారికి ఏదో రకంగా చేయూతనందించాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడానికి క్లబ్‌లో చేరికలను పెంచుకోవాలన్నారు. సిద్దిపేట లయన్స్‌క్లబ్ అన్ని క్లబ్‌లకు అదర్శంగా నిలుస్తుందన్నారు. దుర్గవాణి సురభి, లయన్ జి.ఆర్. సూర్య రాజు, అమర్‌నాథ్‌రావు, గంప రమేష్, రాధాకృష్ణ, రమేష్ మాట్లాడారు.

**చిన్నకోడూరు పాఠశాలకు ప్లేట్లు పంపిణీ**

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చిన్నకోడూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.25 వేల విలువ చేసే 300 ప్లేట్లను హెచ్ఎం లక్ష్మయ్యకు అందించారు. అంతకు ముందు లయన్ మెల్విన్ జోన్స్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జ్యోతి, నిర్మల, శేఖర్, రమేష్, నారాయణ, సత్యం, సురేష్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పంతం రవీందర్, సుమ, జోజి, కిషోర్, చందు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా పోల్కంపల్లి జయంతి, మరుమాముల శ్రీమయి, అంబటి కనకవ్వ, మరుమాముల చిన్మయి, ఐలేని రజిత, గుర్రం స్వప్న, పుల్లూరు లక్ష్మీ, కోటగిరి రమాదేవి, నారోజు ముక్తేశ్వరీ, అశ శ్యామలాదేవి, ధర్మ వెన్నె లను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు.

## ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

**తొగుట, మార్చి 13, ప్రభాతవార్త :** రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న ముదిరాజ్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం పట్ల ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు, జిల్లా ముదిరాజ్ జర్నలిస్టుల కార్యదర్శి ఉల్లెంగాల సాయికుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సిఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## సిఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



బందారంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలభిసేకం చేస్తున్న దృశ్యం

**కొండపాక, మార్చి 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి బందారంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు పాలడుగు బాల్‌రెడ్డి అధ్వర్యంలో పాలభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు, అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ గత పది సంవత్సరా పోరాట పలితంగానే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటైయిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటు వల్ల పెద రెడ్డిలకు ఎంతో మేలు జరుగుతుందని తెలపారు. గత ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన అధికారంలోకి వచ్చక ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామిని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌పార్టీకే దక్కుతుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి వర్గానికి రెడ్డి సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి సంఘం సభ్యులందరు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బట్ట పరుశురాములు, సురేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, యాదవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కార్పొరేషన్లతో అన్ని వర్గాలకు లబ్ది

**షాబాద్, మార్చి 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లతో అన్ని వర్గాలకు లబ్దిచేకూరుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ....అన్ని కులాల కార్పొరేషన్‌ల ఏర్పాటు కోసం ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం.... వంద రోజుల్లోనే కార్పొరేషన్లు ఏర్పాటు చేసినం దుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన మాట నిలపెట్టుకున్నందుకు అన్ని వర్గాలు కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞత తెలియజేస్తున్నాయని ఇదో గొప్ప విషయమన్నారు. గత 35 సంవత్సరాలుగా సీఎం తనకు మంచి సన్నిహితుడని, ఆయన మాట ఇచ్చాడంటే తప్పకుండా నెరవర్చుతాడన్నారు. కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు.






మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్న మహిళలు

## ఘనంగా మహిళా దినోత్సవం

**మునిపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:** సిద్దాపూర్ కాలనీలోని కోవాలి వెంచర్‌లో మహిళలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సదాశివపేట సబ్ రిజిస్ట్రార్ ఎండి వమీద్, కౌన్సిలర్ లియాన్‌షరీఫ్‌లు ఆట పాటల పోటీల్లో ప్రతిభ చాటిన విజేతలకు బహుమతులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ఇందిర, సావిత్రి, సుజాత, మన్మిన్, లత, లలిత, పార్వతి, పంతులమ్మ, మైనార్టీ మహిళలు, అశోక్, సురేష్ పంతులు, రాజు సంగమేశ్వర్, శివకుమార్, అడ్డగట్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**భారతీనగర్ డివిజన్‌లో...**




కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డిని సన్మానిస్తున్న మహిళలు

**రామచంద్రాపురం, మార్చి 13, ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం భారతీనగర్ డివిజన్‌లో వేడుకలను ఘనండి జరుపుకున్నారు. డివిజన్ పరిధిలోని హెచ్ఐజి కమ్యూనిటీ భవనంలో దుర్గాబాయా దేశ్‌ముఖ్ మహిళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేటర్ వి.సింధూఆదర్శరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సమితి మహిళలు కార్పొరేటర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందచేశారు. అనంతరం సింధూ ఆదర్శరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. డివిజన్ మహిళలకు అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు కాత్యాయని, కార్యదర్శి దక్షాయని, కీరవాణి తదితరులు ఉన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఎంఈఓ



ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ దథరథ్

**మునిపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:** గార్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ దశరథ్ సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రార్థన కోసం సిద్ధం అవుతుండగా ఎంఈఓ దశరథ్ పాఠశాలకు చేరుకుని విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. పాఠ శాలలో 7మంది ఉపాధ్యాయులకుగాను 5 మంది ప్రార్థనలో ఉండగా ఇరువురు ఉపాధ్యాయులు వర్క్ అడ్జస్టమెంట్‌లో ఉన్నారని, 64మంది విద్యార్థులకుగాను 42 మంది ప్రార్థన సమయానికి హాజరైనట్లు ఎంఈఓ దశరథ్ తెలిపారు.

## మునిపల్లిలో సిసి రోడ్డు పనులకు శ్రీకారం



మునిపల్లిలో సిసి రోడ్డు పనులకు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

**మునిపల్లి, మార్చి 13,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రాజనర్సింహ కాలనీలో బుధవారం 5 లక్షల రూపాయల ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచనల మేరకు గ్రామంలో సిసి రోడ్డు పనులను ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజుపాటిల్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీరన్నపాటిల్ నరేందర్‌గౌడ్, పరమేశ్వర్, నిసార్, రాందాస్, సిరాజుద్దీన్, మహేందర్, తాజా మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గార్లపల్లి పాఠశాలలో స్వయం పాలన



గార్లపల్లి పాఠశాలలో స్వయం పాలన జరుపుకుంటున్న విద్యార్థులు

**మునిపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:** మండలంలోని మునిపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుదవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంఈఓగా సలావుద్దీన్, ప్రధానోపాధ్యాయులుగా రాజు, ఉపాధ్యాయులుగా శివశంకర్, వరుణ్, మోక్ష, ఇబ్రహీం, మహబూబ్, సుశాంత్, చరణ్ తేజ్, గంగోత్రిలు వ్యవహరించారు. ప్రతిభ చాటిన ఉపాధ్యాయులైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణుగౌడ్, ఉపాధ్యాయులు రేణుక, సతీశ్వర్, మల్లేశం, అరవింద్‌లు అభినందించారు.

## పోచమ్మగుడి నిర్మాణానికి రూ. 51 వేలు విరాళం

**శివ్వంపేట, మార్చి 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మగ్దూంపూర్ గ్రామంలో పోచమ్మ దేవాలయం నిర్మాణానికిగాను జిల్లా పరిషత్ ప్రణాళిక సంఘం సభ్యులు, జెడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్త రూ. 51 వేల విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మహేష్‌గుప్త మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లోనూ నిర్మిస్తున్న దేవాలయాల నిర్మాణాలకు పూర్తి సహకారం అందజేస్తున్నానన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు ఎండి. నజీరోద్దీన్ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మహేష్‌గుప్త వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి సోము అశోక్, కత్తి గిరిబాబు, కత్తి నర్సింలు, కత్తి స్వామి, హనుమంతు, రాజశేఖర్, షేక్ తాబేర్, ఎండి. షాబోద్దీన్, ఎండి. హర్షద్, సోముకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేటినుంచి అనంత పద్మనాభస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు

**రామచంద్రాపురం, మార్చి 13, ప్రభాతవార్త:** భక్తుల ఇలవేల్పు, బ్రహ్మాండ నాయకుడు వెలిమెల శ్రీలక్ష్మీ సమేత అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీనుంచి 3 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ బాధ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈసారి మార్చిలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. ఉత్సవాలకు 20 వేలకుపైగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించనున్నారు.



ఆలయంలో శ్రీలక్ష్మీదేవి సమేతంగా కొలువైవున్న అనంత పద్మనాభ స్వామి

**నిత్య పూజలు...**

ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రీలక్ష్మీ సమేత అనంత పద్మనాభస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా 14న ఉదయం 6 గంటలకు గోపూజ, వరుణ పూజ, మూల మూర్తికి విశేష అభిషేకాలు, అలంకరణ, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనము, ఆచార్యాది రుత్వి క్వరణం, ధ్వజారోహణం, నాందిస్థాపనం, అంకురార్పణం, ఉదయం 10 గంటలకు యాగశాల ప్రవేశం, అగ్ని స్థాపనం, గణపతి హోమం, నవగ్రహాల హోమం, బ్రహ్మాది దేవత హోమాలు, విష్ణు, మహాలక్ష్మి, సుదర్శన హోమం, రాత్రి 8 గంటలకు స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. 15న ఉదయం 8 గంటలకు సామూహిక విష్ణు హోమం, పవమాన హోమం, లక్ష్మీ నరసింహ హోమం, సాయంత్రం 6 గంటలకు మహా పుష్పయాగం, చతుర్వేద రాజోపచార సేవ, 16న తెల్లవారుజామున 4.21 గంటలకు స్వామి వరిక దివ్య రథోత్సవం, 8 గంటలకు చక్ర తీర్థ స్నానం, 10 గంటలకు మహా పూర్ణాహుతి, మహా దాశీర్వచనం, ఆచార్యాది కుంభాభిషేకం, సాయంత్రం 5 గంటలకు విగ్రహాలకి జలధివాసం, ధాన్యాధివాసం, శయ్యది వాసం, ఫలాదివాసం, పుష్పదివాసం, రాత్రి 8 గంటలకు చతుర్విద రజోపచార సేవ, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

**ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహిస్తాం...**

ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం అయ్యే బ్రహోత్సవాలను నేత్ర పర్వంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు 16, 17వ వార్డుల కౌన్సిలర్లు సుచరితకొమురయ్య, పట్లోళ్ల రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. స్వాగత తోరణాలు, విరుమిట్లు గొలిపే విద్యుత్ లైట్లు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా తగు ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయానికి పటాన్‌చెరు నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు వివరించారు.



నాగదేవత విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న కాంగ్రెస్ నేత ఉజ్వల్‌రెడ్డి

## ముగిసిన నాగదేవత విగ్రహాల ప్రతిష్టాపన

**జహీరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** పట్టణంలోని శివాలయం సమీపంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న నాగదేవతల విగ్రహాల ప్రతిష్ట పూజా కార్యక్రమాలు బుధవారంతో భక్తి శ్రద్ధలతో ఘనంగా ముగిసాయి. బుధవారం నిర్వహించిన పూజల్లో కాంగ్రెస్ నేత డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి, ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహాల ప్రాణ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు పుణ్యదంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనగా వేద బ్రాహ్మణులు వేద మంత్రాలు వల్లిస్తుండగా హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకార్యాలు కల్గకుండా ఆలయ కమిటి బాధ్యులు తగు సౌకార్యాలు కల్పించారు. పూజా కార్యక్రమాలకు ఆయా ఆశ్రమాల పీఠాధిపతులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపార వేత్తలు, ఆలయ కమిటి బాధ్యులు అల్లాడి వీరేశం గుప్తా, గోలి వారి సంజు కుమార్, అల్లాడి వంశీకృష్ణ, గుడికి మహేందర్, గొల్ల భాస్కర్, అల్లాడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు అందుకున్న పిల్లుట్ల స్వామి




అవార్డు అందుకుంటున్న పిల్లుట్ల స్వామి

**శివ్వంపేట, మార్చి 13 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయస్థాయి మహనీయుల అవార్డుల మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈ మహోత్సవంలో శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్కుల గ్రామానికి చెందిన పిల్లుట్ల స్వామి అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు అందుకోవడం జరిగింది. వల్లూరి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, అడిషనల్ ఏఎస్పీ తెజావత్ రామదాసు, సినీ నటులు, సంఖ్య శాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మల చేతుల మీదుగా పిల్లుట్ల స్వామి అవార్డు అందుకున్నారు. యుక్త వయస్సు నుండి అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని నేను చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును అందుకోవడం పట్ల సంతోషకరంగా ఉందని పిల్లుట్ల స్వామి అన్నారు. నా వెన్నంటే ఉంటూ సంపూర్ణ సహకారం అందిస్తున్న తన కుటుంబ సభ్యులకు ఈ అవార్డును అంకితం చేస్తున్నానని ఆయన తెలిపారు.

## ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు



మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, మార్చి13 ప్రభాతవార్త:** రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన తొలి మహిళా కవిగా మొల్లమాంబకు ఘనత తగ్గింది. కాగా బుధవారం మొల్లమాంబ జయంతి సందర్భంగా వెల్దుర్తి పట్టణ కుమ్మరి సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి ముకుందం, రవీందర్, రమేష్, మహేష్, శివరాజ్, రాఘవేందర్, శ్రీకాంత్, నరేష్, ప్రశాంత్, వేణు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ సీజ్

**కొల్చారం, మార్చి13 ప్రభాతవార్త:** అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామ సమీపంలో అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారన్న నమ్మదగిన సమాచారంతో అక్కడికి చేరుకొని అక్రమంగా ఇసుకను తరలిస్తున్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన అట్టెం సిద్ధిరాములు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు



పార్వతీ దేవి సమేత సంగమేశ్వరుడికి పూజలు చేస్తున్న అర్చకులు

## భక్తి ప్రపత్తులతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

**-స్వామిని దర్శించుకున్న మూడు రాష్ట్రాల భక్తులు**

**ఝరాసంగం, మార్చి 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పార్వతీ దేవి సమేతంగా కొలువున్న కేతకి సంగమేశ్వరుడి ఆలయంలో మహాశివ రాత్రిని పురస్కరించుకుని నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ప్రశాతంగా, భక్తి శ్రద్ధలతో ఘనంగా ముగిసాయి. ఉత్సవాల ముగింపును పురష్కరించుకుని బుధవారం అర్చకులు స్వామివారికి హర మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాతర ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా సహకరించిన భక్తులు, అందుకు కృషి చేసిన అధికారులకు ఆలయ ఈఓ శశిధర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బసయ్యస్వామి, జూనియర్ అసిస్టెంట్ శివకుమార్, భక్తులు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటుపట్ల హర్షం



యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివకుమార్ తదితరులు

**నాగల్‌గిద్ద, మార్చి 13, ప్రభాతవార్త:** వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ఎంపి సురేశ్‌కుమార్ శెట్కార్‌కు, ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలపారు. బుధవారం స్థానిక విలేఖరులతో నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కార్పొరేషన్ కోసం ఎదురుచూస్తున్న వీరశైవుల కల నెరవేరేలా చొరవ తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివకుమార్, కాంగ్రెస్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

## దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, మార్చి 13 ప్రభాతవార్త:** ప్రజల్లో భక్తి భావం పెంపొందించేందుకు నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండలం వడక్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతా రామచంద్రస్వామి, హనుమాన్ దేవాలయాల్లో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం జానకంపేట గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచులు లలిత మల్లేష్, పాండు యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

**-పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వల్లందేశీ శ్రీనివాస్ నేత**

**పావన్నపేట, మార్చి 13, ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పద్మశాలి సంఘానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లందేశీ శ్రీనివాస్ నేత ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నోఏళ్ల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో అన్ని కులాలకు న్యాయం చేసేలా ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారని కొనియాడారు. కార్య క్రమంలో నాయకులు పడిగే కృష్ణ, బద్దపురం సంగేమేశ్వర్, పోల శ్రీనివాస్, శివశంకర్, తూర్పు రమేష్, కల్లేటి యుగంధర్, పల్లె రాజు, పల్లె లక్ష్మణ్, తూర్పు రాజు, యాదగిరి, తూర్పు రాములు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి

**శివ్వంపేట, మార్చి 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గూడూరు గ్రామంలో బుధవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొత్తపేట సరోజన(70) కస్తూరిబా బాలికల పాఠశాల పక్కన గల చింత చెట్ల వద్దకు చింతపండు కోసం వెళ్లింది. పక్కనే ఉన్న గూడూరు గ్రామానికి చెందిన యూసుఫ్ వరి పంటకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వరి చేనుకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడంతో ఘటన స్థలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న శివ్వంపేట పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**మునిపల్లి, మార్చి 13, ప్రభాతవార్త:** ఈనెల 14వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ హరి నందన్‌రావు తెలిపారు. ఎంపిపి అధ్యక్షురాలు గౌడిగామ శైలజ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఆయా శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరుకావాలని సూచించారు. మండల సభ్యులు సమయానికి సమావేశానికి హాజరుకావాలని ఎంపిడిఓ హరినందన్‌రావు సూచించార.

## వీరశైవ లింగాయ్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం అభినందనీయం

**రాష్ట్రీయ బసవదళ్ ఇన్‌చార్జి బిరేదార్ నగేష్ కృతజ్ఞతలు**

**మనూర్, మార్చి 13, ప్రభాతవార్త:** వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం అభినందనీయమని రాష్ట్రీయ బసవదళ్ ఇంచార్జి బిరేదార్ నగేష్ ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం నగేష్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరా వీరశైవుల కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేసేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. వీరశైవుల కార్పొరేషన్ ఏర్పాటుకు విశేష కృషి చేసిన మాజీ ఎంపి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ కుమార్ శెట్కార్, కార్పొరేషన్ ఏర్పాటుకు క్యాబెనెట్ ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, బిసి మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు నగేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించిన అధికారులు

**మనూర్, మార్చి 13, ప్రభాతవార్త:** మండలంలోని ఎల్గోయి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్, ఉల్లిగడ్డ పంటలను ఉద్యాన శాఖ అధికారి సమత, ఏఈఓ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఎండా కాలంలో పంటల సంరక్షణకు రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్దతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు రాజేందర్ రావు, ప్రసాద్‌రావు,పాండు తది తరులు ఉన్నారు.

## శ్రీశైలంకు భక్తుల పాదయాత్ర

**ఝరాసంగం, మార్చి 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు మండలంలోని నర్సాపూర్ గ్రామాల నుంచి భక్తులు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలో భ్రమరాంబ సమేతంగా కొలువున్న మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు బుధవారం పాదయాత్రగా పయనమయ్యారు. ప్రతి సంవత్సరం ధనసిరి వీరేశ్వర శివాచార్య స్వామిజీ ఆధ్వర్యంలో శ్రీశైలంకు పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి శివనామ స్మరణ చేస్తూ బయలెక్కారు.

## శ్రీశైలంకు ధనసిరి నుంచి పాదయాత్ర

**జహీరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని ధనసిరి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో శ్రీశైలంలో బ్రమరాంభ సేమేతంగా కొలువున్న శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు పాదయాత్రన బుధవారం శివనామ స్మరణతో పయనమయ్యారు. గ్రామం నుంచి ప్రతి సంవత్సరం భక్తులు శ్రీశైలంకు పాదయాత్రగా వెళ్లడం 29 సంవత్సరాల నుంచి కొనసాగుతోందని భక్తులు పేర్కొన్నారు. గ్రామం నుంచి 380 కిలోమీటర్ల దూరంలోని శ్రీశైలంకు భక్తులు పాదయాత్రగా వెళుతూ వస్తున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమాన్ మందిర గణేష్ యువజన సంఘం బాధ్యులు నాగేష్, వీరేష్, ప్రశాంత్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గణేష్,అమిత్, శ్రీనివాస్, అశోక్, బిజెపి నాయకులు నౌబాద్ జగన్నాథ్, ఎంపిటిసి సభ్యులు బాబు, రాజు, మల్లికార్జున్‌రెడ్డి విజేందర్‌రెడ్డి, మస్పి అశోక్, సంతోష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఔదత్‌పూర్‌లో సిసి రోడ్డు పనులకు శ్రీకారం



ఔదత్‌పూర్‌లో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నాగల్‌గిద్ద, మార్చి 13, ప్రభాతవార్త:** మండలంలోని ఔదత్‌పూర్ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణాన్ని ప్రారంభించారు ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నిధులు మంజూరు చేయించారని గ్రామ మాజీ సర్పంచ్ నర్సింగ్ పాటిల్, కాంగ్రెస్ నాయకులు వై పండరిలు అన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి హయాంలో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం తధ్యమన్నారు.

## యాదవుల హక్కుల కోసం పోరాడిన రాములుయాదవ్

**యాదవుల పోరాట సమితి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నారాయణయాదవ్**



మాట్లాడుతున్న నారాయణయాదవ్

**పటాన్‌చెరు, మార్చి 13,ప్రభాతవార్త:** యాదవుల హక్కుల కోసం నిరంతరం పోరాడినవ్యక్తి మేకల రాములయాదవ్ అని యాదవ హక్కుల పోరాట సమితి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దాసరి నారాయణయాదవ్ కొనియాడారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన సంగారెడ్డి జిల్లా యాదవులు హక్కుల పోరాట సమితి అధ్యక్షులు దాసరి నారాయణయాదవ్, జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మేకల రాములుయాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. 15 సంవత్సరాలుగా యాదవుల హక్కులకోసం పోరాడుతున్న వ్యక్తి రాములుయాదవ్ అని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యాదవుల హక్కులపోరాట సమితి అధ్యక్షులు వంశీమోహన్ పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం : ఇన్‌చార్జి ఎంపిడివో

**కొల్చారం, మార్చి13 ప్రభాతవార్త:** నేడు(గురువారం) ఉదయం 11 గంటలకు కొల్చారం మండల సర్వ సభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కోరబోయిన మంజులకాశీనాథ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి ఎంపీడీవో లక్ష్మీనర్సింలు అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, ఆయా శాఖల అధికారులు తమ నివేదికలతో సకాలంలో విధిగా హాజరు కావాలని ఇంచార్జి ఎంపీడీవో లక్ష్మీనర్సింలు అన్నారు.

## ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక

**-20 వేల 5వందల రికవరీకి ఆదేశాలు**

**న్యాల్‌కల్, మార్చి 13, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులపై అధికారులు తనిఖీ నిర్వహించగా తనిఖీ నివేదికలపై అధికారులు నరపజా వేదిక కార్యక్రమంలో సమీక్షించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామి పనుల్లో జరిగిన అవినీతిపై 20వేల 5వందల రూపాయలను రికవరీకి చేయనున్నట్లు ఉపాధి ఏపిఓ రంగారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిఆర్‌డిఓ బాలరాజ్, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, విజిలెన్స్ నాగేశ్వరరావు, ఎస్ఆర్‌పి స్వామి, ఇంచార్జి ఎంపిడిఓ సురేష్, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు